శిథిలావస్థలో పీహెచ్‌సీ క్వార్టర్స్

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం
- పిచ్చిమొక్కలతో నిండిపోయిన భవనాలు


శిథిలావస్థకు చేరుకున్న వైద్య సిబ్బంది క్వార్టర్స్

ఎన్పీకుంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సమీపంలో ఉన్న వైద్యాధికారుల క్వార్టర్స్(సిబ్బంది నివాస భవనాలు) శిథిలావస్థకు చేరాయి. దీంతో వైద్యసిబ్బంది స్థానికంగా నివాసం ఉండటంలేదు. ఈ క్రమంలో అత్యవసర సమయాల్లో ప్రైవేటు ఆసుపత్రులకు ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రజలకు వైద్యసేవలు అందించడానికి 1980లో 'ఇండియా పాపులేషన్ ప్రాజెక్ట్–2' కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పనిచేసే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేందుకు క్వార్టర్స్ నిర్మాణం చేపట్టారు. ఈ క్వార్టర్స్‌లో (మెడికల్ ఆఫీసర్స్‌కు 2, వైద్య సిబ్బందికి 6, క్లాస్–4 సిబ్బందికి 4) 12 భవనాలు నిర్మించారు. గదులపై కప్పులు దెబ్బతిని వర్షాలకు కారుతున్నాయి. దీనితో అధికారులు కాని, సిబ్బంది కాని ఉండటానికి సముఖత చూపడంలేదు. దీనితో ఆ భవనాలు అన్నీ ఖాళీగా ఉండిపోయి, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి.

అడవిని తలపిస్తున్న క్వార్టర్స్

క్వార్టర్స్ చుట్టూ అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. ముళ్లపొదలను విషపురుగులు ఆవాసాలుగా మార్చుకున్నాయి. అధికారులు మరమ్మతులు చేయించలేదు. అలాగే పనిచేసే చోటే కాపురం ఉండాలన్న ప్రభుత్వ నిబంధనను ఆరోగ్య సిబ్బంది పాటించడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదు. దీనికి తోడు సిబ్బంది పట్టణాలలో ఉండటంతో రాత్రిపూట అత్యవసర పరిస్థితుల్లోలో గ్రామీణులకు మెరుగైన వైద్యం అందనిద్రాక్షగా మారింది. ప్రస్తుతం క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరి భవనాలు ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలతో పాటు జూదరులకు, మద్యం ప్రియులకు ఆవాసంగా మారాయి.ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్స్‌ను మరమ్మతులు చేయించి, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి వైద్యసేవలు అందించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అత్యవసర వైద్యసేవలకు ఇబ్బందులు



స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నప్పటికీ రాత్రి సమయాల్లో అత్యవసర వైద్యసేవల నిమిత్తం వస్తే ఒక స్టాఫ్‌నర్సు మాత్రమే అందుబాటులో ఉంటారు. దీనితో వైద్యసేవల కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. గతంలో ఇక్కడి క్వార్టర్స్‌లో సిబ్బంది అందరూ ఉండేవారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరడంతో సౌకర్యాలు లేనందున వైద్యాధికారులు స్థానికంగా ఉండడం లేదు.

– ఆటో కిష్టా, అంబేద్కర్‌నగర్ కాలనీ, ఎన్పీకుంట

వినియోగంలోకి తీసుకురావాలి



మండలంలోని ప్రజలకు వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించారు. అలాగే వైద్య సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మించారు. గతంలో వైద్యసిబ్బంది స్థానికంగా ఉండి సేవలను అందించేవారు. ఇప్పుడు క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. ఆ భవనాలన్నింటిని మరమ్మతు చేసి వినయోగంలోకి తీసుకొచ్చి వైద్య సిబ్బంది స్థానికంగా ఉండేటట్లు చూడాలి.

– రామచంద్ర, వంకమద్ది, ఎన్పీకుంట

నివాసయోగ్యంగా లేవు

ఇక్కడ వైద్య సిబ్బంది కోసం నిర్మించిన హెడ్ క్వార్టర్స్ సుమారు 13 సంవత్సరాల క్రితమే శిథిలావస్థకు చేరాయి. భవనం పైకప్పు దెబ్బతినడంతో వర్షాలకు కారుతున్నాయి. నివాసయోగ్యంగా లేవు. గతంలో ఉన్న అధికారులు వీటికి సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించారు.

– డాక్టర్ ఆసియా, మండల వైద్యాధికారిణి

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం


వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహిళలు ఆచరించారు. అర్చకులు రాజేష్ వేంకటేశ్వరస్వామిని ప్రత్యేక పూలు, పట్టువస్త్రాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని చేశారు. పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీష్, ప్రధాన కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే మంచి భవిష్యత్తు


విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి

ధర్మవరం అర్బన్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం ప్రభుత్వం సరఫరా చేసిన నోటు పుస్తకాలు, బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాడిమర్రి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో 75 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే విద్యా పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యాపకులు పోతలయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడిగా వేణు

తనకల్లు: వాల్మీకి సేవా సంఘం మండల నూతన అధ్యక్షుడిగా బాలసముద్రంకు చెందిన వలస వేణును ఎన్నికయ్యారు. రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం కోర్ కమిటీ నుంచి నియామక పత్రం అందినట్లు వేణు శనివారం తెలిపారు. వాల్మీకుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మాదిగల అభ్యున్నతికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశ్వనాథ్

పుట్టపర్తి టౌన్: మాదిగల అభ్యున్నతికి కృషి చేస్తామని ఏపీ సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ వైకె విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సాయి ఆరామంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. నాయకులు పలక అంజనేయులు, గౌరవ సలహాదారు మాతంగి తిప్పన్న, పైపల్లి నరశింహులు, కేశాపురం వెంకటరాముడు, పెడపల్లి గంగప్ప, నరసింహులు, సాయిప్రసాద్, ఓడీచెరువు నరసింహులు, బండ్లపల్లి నరశింహులు, బుక్కపట్నం చంద్ర, గంగులప్ప పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న మోహన్‌రామ్

గాండ్లపెంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి మోహన్‌రామ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని మందులు, రికార్డులను పరిశీలించి చిన్న పిల్లల వ్యాక్సినేషన్ పై ఆరా తీశారు. అత్యవసర మందులు, ప్రసవాలు, ఓపీపై వైద్యాధికారి మహేశ్వర మారుతిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

నల్లమాడ: శిక్ష సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా శనివారం గోపేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు మొక్కలు నాటారు. హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయురాలు ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

కనగానపల్లి: తగరకుంటలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసినట్లు అనంతపురం కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యుడు రామ్‌కుమార్ తెలిపారు. సర్పంచ్ మాధవరాజులు సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు.

గ్రామీణ బాలికలు క్రీడల్లో రాణించాలి


పరుగుపందెంలో పాల్గొన్న బాలికలు

గాండ్లపెంట: బాలికలు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ–2 శ్రీనివాసులు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ నిర్వహించారు. తొలుత ఫాదర్ ఫెర్రర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ–2, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, హెచ్‌ఎం సిద్దారెడ్డి, ఎస్ఐ క్రిష్ణవేణి పోటీలను ప్రారంభించారు. గాండ్లపెంట, కస్తూర్బా, కటారుపల్లి, రెక్కమాను, గూటిబైలు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినులు అండర్–14, 16 పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ పోటీల్లో పాల్గొన్నారు. లాంగ్‌జంప్‌లోచరిత, షాట్‌పుట్‌లో పవిత్ర, 100 మీటర్లు పరుగుపందెంలో గుణదీపిక, షాలినీ, 200 మీటర్ల పరుగుపందెంలో రషిని, ఎం.లిఖిత, లాంగ్‌జంప్‌లో గుణదీపిక, షాట్‌పుట్‌లో జాహ్నవి గెలుపొందారు. వీరు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆర్డీటీ ఏటీఎల్ బాషా తెలిపారు. ఉపాధ్యాయులు గంగాధర, ముంతాజ్‌అలీ, పీడీలు రాయుడు, హరిప్రసాద్, హరూన్,ఆనందరెడ్డి, ప్రసాద్, అహల్య, ఆర్డీటీ కోచ్ రామయ్య, ఆర్డీటీ ఎస్‌టీఎల్ రాంప్రసాద్‌రెడ్డి, సీఓలు నారాయణ, గంగాధర, సీతమ్మ పాల్గొన్నారు.

నల్లమాడ: ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆర్.రామాపురం బాలికల గురుకుల పాఠశాల మైదానంలో శనివారం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన గ్రామీణ విద్యార్థినులకు క్రీడా పోటీలు నిర్వహించారు. నల్లమాడ, ఓడీ చెరువు మండలాల విద్యార్థినులుపాల్గొన్నారు. సంస్థ కదిరి రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. 60, 100, 200 మీటర్ల లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించి విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందించారు. నల్లమాడ హైస్కూల్ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి, సీఎస్‌టీఎల్ తిప్పమయ్య, ఏటీఎల్ వన్నూరుస్వామి, సీఓ గంగప్ప, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రం ప్రారంభం

బత్తలపల్లి: తంబాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి ఖాసీంస్వామి(మొహర్రం) ఉత్సవాలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. గ్రామపెద్దల సమక్షంలో పీర్లను భద్రపరిచే పెట్టెను కిందకు దించి ముజావర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుండం తీసి వేడుకలకు అంకురార్పణ చేశారు. వేడుకలు ఐదు రోజుల పాటు వైభవంగా జరుగుతాయి. సోమవారం పెద్ద సరిగెత్తు వేడుకలు మంగళవారం జలధి నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

'అన్నదాత సుఖీభవ' డబ్బు ఎప్పుడిస్తారు?

- మండల సమావేశంలో సభ్యుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పుష్పలత

ధర్మవరం రూరల్: అధికారంలోకి వస్తానే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20 వేల చొప్పున ఇస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నేటికీ వాటి గురించి ఎటువంటి ప్రకటన చేయలేదని, డబ్బు ఎప్పుడిస్తారో చెప్పాలని ఎంపీటీసీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఎంపీపీ గిరక రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేర్చుతారో చెప్పాలని అధికారులను అడిగారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని, వచ్చిన వెంటనే సభ ద్వారా అందరికి తెలియజేస్తామన్నారు. అనంతరం అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి వైపుకు తీసుకెళదామన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. డాక్టర్ పుష్పలత, ఏపీఓ అనీల్‌కుమార్‌రెడ్డి, ఏఈఓ అశ్వనీ, ఏపీఎం రఘునాథరెడ్డి, ప్రజా ప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

అమడగూరు: అమడగూరులోని చౌడేశ్వరీ కల్యాణమండపంలో అమడగూరు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 68 మంది దాతలు రక్తదానం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ రెండేళ్లుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటుగా వివిధ రకాల సేవలను అందిస్తున్నామన్నారు. అనంతరం రక్త యూనిట్లను కదిరి ఏరియా ఆస్పత్రివారికి అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ కవిత శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ షబ్బీర్, అసోసియేషన్ అధ్యక్షుడు నాగార్జున, కోశాధికారి శివశంకర, గౌరవ సలహాదారు రామాంజి పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

చెన్నేకొత్తపల్లి: ప్రథమ చికిత్సా కేంద్రాల్లో రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని పలు ప్రథమ చికిత్సా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలకు వచ్చే వారికి సెలైన్ బాటిళ్లు, ఇంజక్షన్ వేయరాదని సూచించారు. అవసరమైన వారిని దగ్గరలోని ప్రభుత్వాసుపత్రులకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు వెంకటేష్, భాస్కర్ రెడ్డి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

కదిరి అర్బన్: యర్రదొడ్డి పంచాయతీలో శనివారం ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బోడేనాయక్, మీటేనాయక్, రాందాస్‌నాయక్ తండాల్లోని 224 మంది రోగులకు డాక్టర్ సులేమాన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చెన్నేకొత్తపల్లి: హరియాన్ చెరువు గ్రామంలో శనివారం 104 సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. 0 నుంచి 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు అతిసారం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రామంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. పీహెచ్ఎన్ పద్మావతి,ఆరోగ్య కార్యకర్తలు వెంకటేశ్, అశ్విని,ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీతో పాటు ఆశా కార్యకర్త మీనాక్షి పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. ఇన్నర్‌వీల్‌క్లబ్, రోటరీక్లబ్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో శనివారం ఎంఈఓ చేతుల మీదుగా కేతిరెడ్డికాలనీ, ఇందిరమ్మకాలనీ, వైఎస్సార్ కాలనీ, బీఎస్ఆర్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, లోనికోట ఉర్దూ పాఠశాలల్లో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలని భావితరాలకు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఇన్నర్ వీల్‌క్లబ్ అధ్యక్షురాలు నాగరత్న, కార్యదర్శి పర్వీన్, హ్యూమన్ రైట్స్ అధ్యక్షురాలు సుమలత, కార్యదర్శి అఫ్సర్, సర్వ శిక్షా అభియాన్ ఏఏఎంఓ అబ్దుల్ మాలిక్, సీఆర్ఎంటీలు మనోహర్, వరలక్ష్మి, శివ, పాఠశాలల హెచ్‌ఎంలు కుళ్లాయప్ప, చెన్నుడు, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దాం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ మారుతీప్రసాద్

కనగానపల్లి: రాజకీయ వైషమ్యాలన్ని పక్కన పెట్టి గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పని చేద్దామని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ మారుతిప్రసాద్‌తో ఎంపీటీసీలు, సర్పంచులు హాజరయ్యారు. తొలుత శాఖల వారీగా ప్రభుత్వ అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధిలో పయనిచాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు.

పింఛన్ల నిలిపివేతపై ఎంపీపీ, జెడ్పీటీసీ ఆగ్రహం

టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని గ్రామాల్లో సామాజిక పింఛన్ల నిలిపివేయడంపై ఎంపీపీ, జెడ్పీటీసీలు టీడీపీ నాయకులు, అధికారులపై ఆగ్రహం వెలిబుచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎటువంటి తారతమ్యాలు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. ఈ ప్రభుత్వంలో కూడా రాజకీయ విభేదాలు లేకుండా అర్హుదరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. దీనిపై కొందరు టీడీపీ సర్పంచులు, ఎంపీటీసీలు అడ్డుచెప్పటంతో సమావేశంలో కొంతసేపు వైఎస్సార్‌సీపీ, టీడీపీ ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఈ విషయంపై అధికారులు కలుగుచేసుకొని ఇరువురికి సర్దిచెప్పడంతో అంతా సద్దుమునిగింది. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్ కుమార్, వైస్ ఎంపీపీ పద్మావతి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ చలపతి, సీనియర్ అసిస్టెంట్ దేవపుత్ర, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి

ధర్మవరం రూరల్: ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని శనివారం బీజేపీ యువనేత రామక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో ఉన్న అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎన్పీకుంట: టీ.ఎస్.పల్లి జెడ్పీహైస్కూల్‌లో శనివారం బీజేపీ నాయకులు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్జాన్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్ అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలపై వేధింపులు ఆపండి


ఓడీచెరువులో ధర్నా నిర్వహిస్తున్న అంగన్ వాడీ కార్యకర్తలు

ఓడీచెరువు: టీడీపీ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తలపై వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వారు ఆత్మహత్యకు యత్నించిన వీరప్పగారిపల్లికి చెందిన అంగన్‌వాడి కార్యకర్త నాగవేణిని కదిరి ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. అనంతరం ఓడీచెరువులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాగవేణి ఆత్మహత్యయత్నానికి కారణమైన టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అవుట్ సోర్సింగ్ కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐకి వినతిపత్రం సమర్పించారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణం పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఓబిలేసు, లైబ్రేరియన్ రాజం, వెంకటేశ్వర్ ప్రసాద్, అధ్యాపకులు పావని, ఆనంద్, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాద్రీ ఆలయం కిటకిట

కదిరి టౌన్: లక్ష్మీనారసింహ గోవిందనామ స్మరణతో ఖాద్రీ ఆలయం మార్మోగింది. శనివారం కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి నృసింహాలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు అందుకున్నారు. నరసింహస్వామి కాపులు మొక్కుబడిగా తలనీలాలు సమర్పించారు.